

పోస్టర్లు ఆవిష్కరిస్తున్న జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్‌ఖాన్

## 15న బతుకమ్మ సంబురాల చిత్రకళా పోటీలు

హనుమకొండ చౌరస్తా, అక్టోబర్ 7 : రాష్ట్ర ఆడపడుచుల ప్రతిష్టాత్మక పండుగ బతుకమ్మ, దసరా పర్వదినాలను పురస్కరించుకుని సాగంటీస్ ఆర్ట్ అకాడమీ ఆధ్వర్యంలో చిత్ర కళా పోటీలు నిర్వహిస్తున్నట్లు అకాడమీ డైరెక్టర్ సాగంటి మంజుల తెలిపారు. ఈ మేరకు శనివారం హనుమకొండలోని జిల్లా గ్రంథాలయంలో సంస్థ చైర్మన్ మహ్మద్ అజీజ్‌ఖాన్ చేతుల మీదుగా పోటీలకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా మంజుల మాట్లాడుతూ ఈ పోటీలు ఈ నెల 15న ఉదయం 10 నుంచి 12 గంటల వరకు మూడు కేటగిరీల వారీగా ఉంటాయని తెలిపారు. ఆయా విభాగాల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు రెండు ప్రోత్సాహక బహుమతులు అందజేస్తున్నట్లు తెలిపారు. చిన్నారులకు చిత్రకళ మీద ఉన్న ఆసక్తిని పెంపొంచేందుకు ఈ పోటీలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. నేర్చుకోవాలనే ఆసక్తి ఉన్న చిన్నారులకు ప్రతి ఆదివారం శిక్షణ కూడా ఇస్తున్నట్లు తెలిపారు. వివరాలకు 81436 43337 నెంబర్‌లో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో అకాడమీ ముఖ్య సలహాదారులు నిమ్మల శ్రీనివాస్, లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.



ఎంపికైన క్రీడాకారులతో ఎస్‌జీఎఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ బరుపాటి గోపి

## ముగిసిన ఎస్‌జీఎఫ్ క్రీడల ఎంపికలు

హనుమకొండ చౌరస్తా, అక్టోబర్ 7 : ఆత్మస్థైర్యం పెంపొందాలంటే క్రీడలతోనే సాధ్యమని ఎస్‌జీఎఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ బరుపాటి గోపి అన్నారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ వరంగల్ జిల్లా ఆధ్వర్యంలో ఎస్‌జీఎఫ్ జిల్లాస్థాయి బాలబాలికల సెలక్షన్ ఎల్బీ కాలేజీలో నాలుగు రోజులుగా నిర్వహించారు. శనివారం జరిగిన ముగింపు కార్యక్రమంలో బరుపాటి గోపి మాట్లాడుతూ శారీరక, మానసిక రుగ్మతలను రూపుమాపేలా క్రీడలు దోహద పడతాయన్నారు. జిల్లాస్థాయిలో గెలుపొందిన క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రస్థాయి, జాతీయ, అంతర్జాతీయస్థాయి వరకు వెళ్లి ప్రతిభను చాటాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ జాయింట్ సెక్రటరీ డాక్టర్ కే సతీశ్, ఏవీవీ ప్రిన్సిపాల్ భూజేందర్‌రెడ్డి, ప్రెస్‌క్లబ్ వైస్ ప్రెసిడెంట్ అల్లం రాజేశ్, సాఫ్ట్ టెన్నిస్ కోచ్ వెంకన్న, బాబురావు, పీడీ శ్రీనివాస్, శ్రీధర్, ఎల్బీ కాలేజీ పీడీ ప్రభాకర్, సంజీవ్, శ్రీధర్, ఫిజికల్ డైరెక్టర్లు కిషన్, వెంకటేశ్వర్లు, రవి, పద్మ, కరుణ, శ్రీదేవి, పార్థసారథి, సంతోష్, రాజు, కుమార్ పాల్గొన్నారు.



వాలీబాల్ పోటీల్లో కమిషనరేట్-కిట్స్ కాలేజీ జట్లతో ఏసీపీ నాగయ్య

## జేఎన్‌ఎస్‌లో వాలీబాల్ టోర్నమెంట్ ప్రారంభం

హనుమకొండ చౌరస్తా, అక్టోబర్ 7 : హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియం(జేఎన్‌ఎస్)లో మిర్యాల్‌కార్ రవీందర్ మెమోరియల్ వాలీబాల్ టోర్నమెంట్ శనివారం ప్రారంభమైంది. ఉదయం ఈ పోటీలను తెలంగాణ స్టేట్ ఖోఖో అధ్యక్షుడు, ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా చైర్మన్ రాఘవరెడ్డి, 7వ డివిజన్ కార్పొరేటర్ వేముల శ్రీనివాస్, మాజీ కార్పొరేటర్ మిర్యాల్‌కార్ దేవేందర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడలు మానసికోల్లాసానికి ఎంతో దోహదపడతాయన్నారు. అనంతరం సాయంత్రం నిర్వహించిన పోటీలను ఏసీపీ నాగయ్య ప్రారంభించి మాట్లాడారు. నేటి యువత క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. నేతాజీ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పీ విజయ్‌కుమార్, కార్యదర్శి బొబ్బిలి వెంకటరెడ్డి మాట్లాడుతూ వరంగల్ ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 18 జట్లు హాజరైనట్లు తెలిపారు. ఆదివారం సాయంత్రం 6 గంటలకు ముగింపు కార్యక్రమంలో చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్ పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ మర్రి ఇంద్రసేనారెడ్డి, సభ్యులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌వి మోసపూరిత హామీలు

- వారిని నమ్మితే నట్టేట మునుగుడే..
- ఆ పార్టీ తెలంగాణ ఇవ్వలేదు.. మనమే కొట్లాడి సాధించుకున్నాం..
- ఎమ్మెల్యేగా ఆశీర్వదించండి.. నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తా
- ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే అభ్యర్థి కడియం శ్రీహరి
- ధర్మసాగర్ మండలంలో కార్యకర్తలతో సమావేశం



కాంగ్రెస్ పార్టీ ఉప సర్పచ్ చింత మధును బీఆర్‌ఎస్ పార్టీలోకి ఆహ్వానిస్తున్న కడియం శ్రీహరి

ధర్మసాగర్, అక్టోబర్ 7 : కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు హామీలు మోసపూరితమైనవి, ప్రజలు వాటిని నమ్మకూడదని మాజీ ఉపముఖ్యమంత్రి, ఎమ్మెల్సీ, బీఆర్‌ఎస్ పార్టీ స్టేషన్‌ఘన్‌పూర్ నియోజవకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కడియం శ్రీహరి అన్నారు. మండలంలోని పెద్దపెండ్యాల, నారాయణగిరి, ముప్పారం, సోమదేవరపల్లె, దేవునూర్, రాపాకపల్లె గ్రామాల కార్యకర్తల సమావేశం శనివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలు వస్తున్నాయని తెలంగాణ ప్రజలను మోసం చేసేందుకు కాంగ్రెస్ పార్టీ అమలు చేయలేని ఆరు హామీలను ఇస్తోందన్నారు. అధికారం కోసమే ఆ పార్టీ ప్రయత్నం చేస్తోందన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని కాంగ్రెస్ పార్టీ ఇవ్వలేదని, కేసీఆర్ నాయకత్వంలో ప్రజలందరినీ ఏకం చేసి కొట్లాడి రాష్ట్రాన్ని సాధించుకున్నామన్నారు. కాంగ్రెస్ పార్టీ ముందుగా రాష్ట్రం ఇస్తే తెలంగాణలో 1200 మంది ఆత్మబలిదానాలు చేసుకునే వారు కాదన్నారు. కొట్లాడి సాధించుకున్న రాష్ట్రంలో సీఎం కేసీఆర్ నాయకత్వంలో తొమ్మిదేళ్లలో ఎంతో అభివృద్ధి జరిగిందన్నారు. సమైక్య రాష్ట్రంలో విద్యుత్ సంక్షోభం ఉండేదని, కేసీఆర్ సీఎం అయిన తర్వాత రైతులకు 24 గంటల నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తున్నారన్నారు. తొమ్మిదేళ్ల కాలంలో విద్యుత్ కోసం ఎక్కడా కూడ రైతులు ధర్నాలు చేయలేదని గుర్తు చేశారు. రైతును రాజు చేయడం కోసం అనేక పథకాలు అమలు చేస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో అసంపూర్తిగా ఉన్న ప్రాజెక్టులను నిర్మించి సాగు నీరు అందించామన్నారు. కాళేశ్వరం, గోదావరి ఎత్తిపోతల ప్రాజెక్టును పూర్తి చేసి, గ్రామాల్లోని చెరువులు, కుంటలను నింపి రైతులకు నీరు అందించామన్నారు. గ్రామాల్లో సమృద్ధిగా పంటలు పండుతున్నాయన్నారు. ఒకప్పుడు వరి సాగులో హార్యాన, మహారాష్ట్రం, పంజాబ్ రాష్ట్రాలు ముందు ఉండేవని, నేడు దేశం గర్వించేలా వరి పంట సాగులో తెలంగాణ మొదటి స్థానంలో ఉందన్నారు. అన్ని గ్రామాల్లో కొనుగోలు కేంద్రాల ద్వారా రైతుకు గిట్టుబాటు ధర కల్పించినట్లు తెలిపారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే గ్రామాలు అభివృద్ధి చెందాలన్నారు. ఇప్పటికే గ్రామాల్లో చాలా అభివృద్ధి పనులు చేశామన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని పలు సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టామని పేర్కొన్నారు. ఆడబిడ్డలకు కల్యాణ లక్ష్మి, ప్రభుత్వ దవాఖానలో ప్రసవం అయిన వారికి కేసీఆర్ కిట్ పథకం అమలు చేసిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. నియోజకవర్గం నుంచి సీఎం కేసీఆర్ బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి తనను ఆశీర్వదించి మీ ముందుకు పంపారని కడియం శ్రీహరి అన్నారు. నిండు మనసుతో తనను ఆశీర్వాదించాలని కోరారు. గెలిచిన ఆరు నెలల్లోనే మీకు ఇచ్చిన హామీలను అమలు చేసి చూపిస్తానని తెలిపారు. ఎమ్మెల్యేగా ఎలాంటి తలవంపులు వచ్చే పనిని చేయనన్నారు. ప్రజలు తల ఎత్తుకునేలా తన పనితనం ఉంటుందన్నారు. అంతే కాకుండా సంక్షేమ పథకాలు అర్హులైన వారికే అందేలా చూస్తానని హామీ ఇచ్చారు. దళిత బంధు పథకానికి నిజమైన లబ్ధిదారులను గుర్తించి, మధ్యవర్తిత్వం లేకుండా, పైసా ఖర్చు లేకుండా అందేలా చూస్తానన్నారు. అంతే కాకుండా నియోజకవర్గానికి గృహలక్ష్మి పథకంలో 3000 ఇండ్లు మంజూరయ్యాయని, సీఎం కేసీఆర్‌తో స్వయంగా మాట్లాడి మరో మూడు వేలు కలిపి మొత్తంగా ఆరు వేల ఇండ్లు తీసుకువస్తానని హామీ ఇచ్చారు. వీటిని నిజమైన లబ్ధిదారులకు అందజేస్తానని తెలిపారు. సంక్షేమ పథకాల అమలులో ఎలాంటి లాభం కోసం పని చేయనని తెలిపారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి గెలుపు కోసం పని చేసేవారికి పదవులు వస్తాయన్నారు. నిండు మనసుతో తనను ఆశీర్వాదించాలని కోరారు. ఈ సందర్భంగా నారాయణగిరి గ్రామానికి చెందిన బీజేపీ వార్డు సభ్యుడు ముక్కెర రవి, దేవునూర్ గ్రామంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన ఉప సర్పంచ్ చింత మధు, మాజీ సర్పంచ్ పోడిశెట్టి స్వామి, బీజేపీకి చెందిన చిరంజీవి, రాజేందర్, సదానందం, రవీందర్, రవితోపాటు పలు గ్రామాలకు చెందిన 50 మంది కడియం శ్రీహరి సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. వీరందరికి ఆయన పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. సమావేశంలో డీసీసీబీ డైరెక్టర్ రాజేశ్వర్ రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు మునిగెల రాజు, ఎంపీపీ నిమ్మ కవితారెడ్డి, జడ్పీటీసీ డాక్టర్ పిట్టల శ్రీలత, వైస్ ఎంపీపీ రవీందర్, వైస్ చైర్మన్ యాదకుమార్, సర్పంచ్‌లు ఆకారపు అన్నమ్మ, గొనెల సమ్మక్క, తోట మంజుల, చిర్ర కవిత, కందుకూరి విజయ, ఎంపీటీసీలు ఆకారపు నాగయ్య, వల్లపురెడ్డి రమాదేవి, లక్క సునీత, శోభ, మాజీ ఎంపీపీలు యాదగిరి, రాజుగారి రఘు, పార్టీ మండల మాజీ అధ్యక్షుడు గుడివెనుక దేవేందర్ పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన గ్రామస్తులు

## జూపార్కు అభివృద్ధికి సహకరించాలి

హనుమకొండ, అక్టోబర్ 7 : హనుమకొండ హంటర్‌రోడ్డులోని కాకతీయ జూపార్కు అభివృద్ధికి స్వచ్ఛంద సంస్థల సహకారం అందించాలని చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్(సీసీఎఫ్) భీమానాయక్ అన్నారు. వన్యప్రాణి వారోత్సవాల్లో భాగంగా వన్యప్రాణుల సంరక్షణ దిశగా వారం రోజుల నుండి వివిధ పాఠశాలల విద్యార్థులకు డ్రాయింగ్, వ్యాసరచన, ఉపన్యాస పోటీలు, అవగాహన సదస్సులను నిర్వహించి, గెలుపొందని విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ముఖ్య అతిథిగా సీసీఎఫ్ భీమానాయక్ హాజరై మాట్లాడుతూ రాబోయే రోజుల్లో ఈ జూపార్కుకు పెద్దపులి, అడవి దున్న, పాముల ప్రదర్శన, విదేశీ పక్షులను తీసుకురానున్నట్లు తెలిపారు. హనుమకొండ, జనగాం జిల్లా అటవీ శాఖాధికారి బీ లావణ్య మాట్లాడుతూ కాకతీయ జూలాజికల్ పార్క్ అభివృద్ధి సాధించాలంటే ఆర్థికంగా ప్రజలు సహకరించి, ఇక్కడి జంతువులను దత్తత తీసుకోవాలని కోరారు. ఇందుకు స్పందించిన లయన్స్ క్లబ్ వారు రూ.3వేలు, రోటరీ క్లబ్ వారు రూ.5వేలు, హనుమకొండలోని ఆదర్శ కాలనీ వారు రూ.3వేలతో పాటు వనసేవ సొసైటీ, ఓరుగల్లు వైల్డ్ లైఫ్ సొసైటీ, వెటర్నరీ కళాశాల విద్యార్థులు దత్తత తీసుకోవడానికి వారి వంతుగా సహకారం అందించినట్లు తెలిపారు. వన్యప్రాణులను కాపాడడంతో పాటు వాటి ఆవాసాలకు సురక్షితంగా చేర్చినందుకు కృషి చేసిన జూపార్క్ రెస్క్యూ టీమ్ లీడర్ డాక్టర్ ప్రవీణ్ కుమార్‌తోపాటు అత్యధికంగా రెస్క్యూ ఆపరేషన్స్ నిర్వహించి 542 వన్యప్రాణులకు కాపాడినందుకు స్వామి, కృష్ణ, శంకర్, స్వామి, కొంరయ్యను సన్మానించి, ప్రశంసా పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఫ్లయింగ్ స్క్వాడ్ డీఎఫ్‌వో నాగభూషణం, రిటైర్డ్ అధికారి పురుషోత్తం, డాక్టర్ సీహెచ్ ప్రవీణ్ కుమార్, సారయ్య, దేవాచారి, పాకల చందర్, వీరభద్రం, పిట్టల రవి, నరేశ్, రవీంద్రనాథ్, పరశురాములు, రేంజ్ ఆఫీసర్లు, జూ సిబ్బంది పాల్గొన్నారు.



జూపార్క్ రెస్క్యూ టీమ్ లీడర్ డాక్టర్ ప్రవీణ్ కుమార్‌ను సన్మానించి, ప్రశంసా పత్రం అందజేస్తున్న అటవీశాఖ అధికారులు

## కలెక్టరేట్‌లో రేపటి గ్రీవెన్స్ రద్దు

హనుమకొండ, అక్టోబర్ 7 : హనుమకొండ కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించే గ్రీవెన్స్ కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. పరిపాలనా పరమైన కారణాల నేపథ్యంలో గ్రీవెన్స్‌ను రద్దు చేస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లా ప్రజలు ఫిర్యాదులు అందించేందుకు కలెక్టరేట్‌కు రావొద్దని కోరారు.

## 10న 'రుమటాలజీ' వైద్యశిబిరం

హనుమకొండ చౌరస్తా, అక్టోబర్ 7 : హనుమకొండ కాకాజీకాలనీలోని శ్రీఏషియన్ రుమటాలజీ సెంటర్‌లో ఈ నెల 10న ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించనున్నట్లు సీనియర్ రుమటాలజిస్ట్ వీ సునీల్ తెలిపారు. శిబిరంలో ఎముకల సాంద్రత, కాల్షియం పరిమాణం తెలిపే రూ.3వేల విలువైన టెస్ట్‌ను ఉచితంగా చేయనున్నట్లు పేర్కొన్నారు. మోకాళ్లు, నడుము, మెడ, భుజాలు వంటి నొప్పులు కలవారు సంప్రదించాలని, ముందుగా 99665 54455, 78935 88057 నెంబర్లలో సంప్రదించి, పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.